క్లుప్తంగా

నేడు మంత్రి పెద్దిరెడ్డి పర్యటన

పులిచెర్ల(కల్లూరు): పల్లె బాట కార్యక్రమంలో భాగంగా మంగళవారం రాష్ట్ర అటవీ, విద్యుత్, పర్యావరణ శాఖా మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఐదు పంచాయతీల్లోని 38 గ్రామాల్లో పర్యటించనున్నట్లు ఎంపీపీ సురేంద్రనాథరెడ్డి తెలిపారు. ఎల్లంకివారిపల్లె, పోశంవారిపల్లె, కొమ్మిరెడ్డిగారిపల్లె, కల్లూరుల్లో ఆర్‌ఓ ప్లాంట్‌లు, కావేటిగారిపల్లెలో హెల్త్ క్లినిక్, కల్లూరులో అతిథిభవనాన్ని ప్రారంభించనున్నట్లు తెలిపారు.

నేడు వాహనాలకు బహిరంగ వేలం

గంగవరం: అక్రమ మద్యం రవాణా కేసుల్లో పట్టుబడి గంగవరం, పెద్దపంజాణి, బైరెడ్డిపల్లి పోలీస్ స్టేషన్ల పరిధిలో సీజ్ చేసిన 31 ద్విచక్ర వాహనాలకు గంగవరం స్టేషన్ ఆవరణంలో నేడు ఉదయం 10 గంటలకు బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్టు ఎస్‌ఐ సుధాకర్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి కలవారు ప్రవేశ రుసుము చెల్లించి వేలంలో పాల్గొనాలని తెలిపారు.

పుంగనూరులో

పుంగనూరు: పట్టణంలోని ఎస్‌ఈబీ పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం వాహనాలను వేలం వేయనున్నట్లు ఎస్‌ఈబీ ఇన్‌స్పెక్టర్ సీతారామిరెడ్డి తెలిపారు. ఆసక్తి గల వ్యాపారులు వేలంపాటలో నిబంధనల మేరకు పాల్గొనాలని కోరారు.

నేడు ప్రత్యేక సమావేశం

సదుం: మండల కేంద్రంలో మంగళవారం ప్రత్యేక సమావేశం నిర్వహించనున్నట్టు సచివాలయాల మండల కన్వీనర్ ప్రకాష్‌రెడ్డి తెలిపారు. పాలమంద, ఊటుపల్లె, కంభంవారిపల్లె, తిమ్మానాయనపల్లె, జోగివారిపల్లె, బూరగమంద సచివాలయాల పరిధిలోని ప్రజాప్రతినిధులు, వలంటీర్లు, సచివాలయ కన్వీనర్లు, నూతనంగా నియమించనున్న గృహసారథులు హాజరు కావాలని కోరారు. ఉదయం 10 గంటలకు సమావేశం ప్రారంభం అవుతుందని, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు సోమశేఖర్‌రెడ్డి, ఎంపీపీ ఎల్లప్ప హాజరవుతారని చెప్పారు.

నేడు మున్సిపల్ సమావేశం

పుంగనూరు: మున్సిపాలిటీ సర్వసభ్య సమావేశం మంగళవారం ఉదయం 11 గంటలకు నిర్వహించనున్నట్లు మున్సిపల్ చైర్మన్ అలీమ్ బాషా తెలిపారు. ఆయన సోమవారం మాట్లాడుతూ మున్సిపాలిటీలో వివిధ అభివృద్ధి కార్యక్రమాల నిర్వహణకు నిధుల కేటాయింపు, తదితర అంశాలపై చర్చించనున్నట్లు తెలిపారు. దీనికి అధికారులు, సభ్యులు తప్పక హాజరుకావాలని కోరారు.

ఓటర్ కార్డుకు ఆధార్ అనుసంధానం

సోమల: ఓటర్లందరూ తమ ఓటరు కార్డుకు ఆధార్‌ను అనుసంధానం చేసుకోవాలని తహసీల్దార్ శ్యాంప్రసాద్ రెడ్డి తెలిపారు. మండలంలోని సోమల, కందూరు, పెద్ద ఉప్పరపల్లె, ఆవులపల్లె సచివాలయాల్లో బీఎల్‌ఓలు, వలంటీర్లతో సోమవారం ఆయన సమావేశాలు నిర్వహించారు. బీఎల్‌వోలు వలంటీర్ల సమన్వయంతో ప్రతి ఓటర్ కార్డును ఆధార్ కార్డుతో అనుసంధానం చేసేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనుసంధానం లేని పేర్లను ఓటరు జాబితా నుంచి తొలగించనున్నట్లు చెప్పారు. డిప్యూటీ తహసీల్దార్ ప్రకాష్‌బాబు, ఆర్‌ఐ సుబుక్తుల్లా, సర్వేయర్ ద్వారకనాథ్, వీఆర్వోలు శ్రీజ, రామచంద్ర, వెంకటరమణ, మురళి పాల్గొన్నారు.

స్పందన సమస్యలను వెంటనే పరిష్కరించాలి



స్పందనలో అర్జీలు స్వీకరిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ పవిత్ర

పలమనేరు: మున్సిపల్ పరిధిలో స్పందనకు వచ్చిన అర్జీలను వెంటనే పరిష్కరించాలని పలమనేరు మున్సిపల్ చైర్‌పర్సన్ పవిత్ర సూచించారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో సోమవారం ఆమె స్పందన కార్యక్రమంలో పాల్గొని ప్రజల సమస్యలను ఆలకించి వారిచ్చిన అర్జీలను సంబంధిత శాఖలకు పంపారు. ప్రభుత్వం స్పందన కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకొందని అధికారులు నిర్లక్ష్యం చేయకుండా అర్జీల పరిష్కారానికి కృషిచేయాలని సూచించారు.

ట్రైనీ అసిస్టెంట్ కలెక్టర్ పర్యటన

తవణంపల్లె: మండలంలోని పలు గ్రామాల్లో అసిస్టెంట్ కలెక్టర్(ట్రైనీ) మేఘస్వరూప్ పర్యటించారు. పుణ్యసముద్రం రైతు భరోసా కేంద్రాన్ని తనిఖీ చేసి, రైతులకు అందిస్తున్న సేవల గురించి సిబ్బందితో ఆరా తీశారు. అదేవిధంగా తవణంపల్లె వెటర్నరీ హాస్పిటల్‌ను సందర్శించారు. మండలంలో పశువులు, పాడి ఆవులు, మేకలు, గొర్రెల వివరాలు తెలుసుకున్నారు. పాడి పరిశ్రమ అభివృద్ధికి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు, వ్యాక్సినేషన్ కార్యక్రమాల గురించి డాక్టర్ లావణ్య వివరించారు. అనంతరం ఎగువ తవణంపల్లెలోని ఆదర్శరైతు వినోద్ రెడ్డి గానుగలతో నూనె తీయడాన్ని, పుంగనూరు జాతి ఆవులను, ఆవు పేడతో తయారు చేస్తున్న పిడకలు, జీవామృతం, ఘనామృతం తయారీ విధానం గురించి అడిగి తెలుసుకున్నారు. మడవనేరిలోని ఆదర్శరైతు పూర్ణచంద్రారెడ్డి దేశీయ ఆవులను పరిశీలించారు.



వేపనపల్లిలో సంక్షేమ పథకాల బుక్‌లెట్‌ను లబ్ధిదారుకు అందజేస్తున్న ఎమ్మెల్సీ భరత్



సంక్షేమ బావుటాను మహిళకు అందజేస్తున్న పలమనేరు ఎమ్మెల్యే వెంకటేగౌడ

గడప గడపలో సంక్షేమ కాంతులు

- జగనన్న రాకతోనే కుప్పంలో ప్రగతి
- చిత్తూరు ఎమ్మెల్సీ భరత్

కుప్పంరూరల్: ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలనలో గడప గడపలో సంక్షేమ కాంతులు వెదజల్లుతున్నాయని చిత్తూరు ఎమ్మెల్సీ భరత్ అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వంలో భాగంగా ఆయన సోమవారం గరిగచీనేపల్లి పంచాయతీలోని వేపనపల్లి, బసవన్నకొటాలు, జాగీరుకొటాలు గ్రామాల్లో 230 గడపలను సందర్శించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల బుక్‌లెట్‌ను అందజేశారు. అనంతరం భరత్ మాట్లాడుతూ, చంద్రబాబు పాలనతో కుప్పం పరిస్థితి అట్టడుగు స్థాయికి చేరిపోయిందని, జగనన్న రాకతో అభివృద్ధి పరుగులు పెడుతోందన్నారు. మూడేళ్లలో 6 లక్షల ఉద్యోగాలు ఇచ్చిన ఘనత ఒక్క జగన్‌మోహన్‌రెడ్డికే సాధ్యపడిందన్నారు. రెండు రోజుల క్రితం కుప్పం వచ్చిన నారా లోకేష్ కుప్పంను అభివృద్ధి చేసేశామని, నిరుద్యోగులే లేరంటూ అబద్ధాలు చెప్పారని గుర్తుచేశారు. కుప్పం అభివృద్ధి వారి సొంత మీడియాలో తప్ప నియోజకవర్గంలో కనిపించలేదని ఎద్దేవా చేశారు. తాము అధికారంలోకి వచ్చాక రెవెన్యూ, పోలీసు సబ్ డివిజన్లను తీసుకువచ్చిన విషయాన్ని గుర్తుచేశారు. కుప్పంను మున్సిపాలిటీగా అప్‌గ్రేడ్ చేసి 66 కోట్ల రూపాయలు అభివృద్ధికి నిధులు కేటాయించినట్లు చెప్పారు. ఇవన్నీ చేస్తున్నందునే గడప గడపలో మహిళలు హారతులు పడుతున్నారన్నారు. చంద్రబాబు, లోకేష్ తరహాలో బూటకపు హామీలు, మాటలు చెప్పలేమని ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో వన్నెకుల క్షత్రియ రాష్ట్ర కార్పొరేషన్ చైర్ పర్సన్ వనిత, జెడ్పీటీసీ ఏడీ ఎస్ శరవణ, నాయకులు మురుగేష్, టమాటా శీనా, చిన్నదొరై, శీను, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

ప్రజల గుండెల్లో నుంచి పుట్టిన వ్యక్తి జగన్

గంగవరం: ప్రజల గుండెల్లో నుంచి పుట్టిన వ్యక్తి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని పలమనేరు ఎమ్మెల్యే వెంకటేగౌడ అన్నారు. గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని సోమవారం మండలంలోని కలగటూరు, ఎస్సీ కాలనీలో నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యేకు నాయకులు ఘన స్వాగతం పలికారు. ప్రతి ఇంటా ప్రజలు ఆశీర్వదించారు. గ్రామాల్లో ప్రతి గడప వద్దకూ వెళ్లిన ఎమ్మెల్యే ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల బుక్‌లెట్‌ను ప్రజలకు అందజేశారు. కార్యక్రమంలో ప్రజలు ఎమ్మెల్యే దృష్టికి తెచ్చిన పలు సమస్యలను అధికారులతో చర్చించి పరిష్కరించాలని ఆదేశించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ పచ్చ మందలో నుంచి పిల్లపిత్రేలు ఎంత మంది వచ్చినా జగన్‌మోహన్‌రెడ్డిని ఢీకొట్టడం అసాధ్యం అన్నారు. ఓట్లేసి గెలిపించిన ప్రజలను గాలికొదిలేసి కేవలం రాబడి కోసమే పరితపిస్తూ, నిరంతరం జేబులు నింపుకుంటూ పాలించిన టీడీపీకి గత ఎన్నికల్లోనే ప్రజలు బుద్ధి చెప్పారన్నారు. ఎమ్మెల్యే అంటే ప్రజా శ్రేయస్సు కోసం పని చేయాలి తప్ప తన స్వార్థం కోసం పని చేయరాదన్న గొప్ప విద్యను తమకు నేర్పిన నాయకులు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. ఈ ప్రభుత్వ గొప్పతనం గురించి ప్రజలే గొప్పగా చెప్పుకుంటుంటే చూసి ఓర్వలేని పచ్చమంద గగ్గోలు పెడుతోందని మండిపడ్డారు. టీడీపీ సేన చేస్తున్న నీచ రాజకీయాలు చూసి ప్రజలు ఛీదరించుకుంటున్నారని ఎద్దేవా చేశారు. ఇప్పటికే క్షేత్ర స్థాయిలో టీడీపీ పూర్తిగా కనుమరుగైందని, వచ్చే ఎన్నికల్లో శాశ్వతంగా భూస్థాపితం ఖాయమని చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మోహన్‌రెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ ప్రహ్లాద, ఎంపీపీ వెంకటరమణ, జెడ్పీటీసీ సభ్యురాలు పార్వతి, ఎంపీటీసీ భారతి మహేష్, సర్పంచుల సంఘం అధ్యక్షుడు గిరిరాజారెడ్డి, నాయకులు చంద్రప్ప, శ్రీరాములురెడ్డి, చలపతిరెడ్డి, నల్లపరెడ్డి, పటాభిరామయ్య, వినోద్‌రెడ్డి, ఎంపీడీవో శివప్రసాద్, అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు అరసనపల్లిలో..

గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం మంగళవారం అరసనపల్లెలో నిర్వహించనున్నట్టు ఎంపీడీవో తెలిపారు. నేటితో మండలంలో ఈ కార్యక్రమం ముగుస్తుందని పేర్కొన్నారు.

వైద్య శిబిరానికి అపూర్వ స్పందన



వైద్యసేవలందిస్తున్న డాక్టర్ శివ

పుంగనూరు: పట్టణంలోని లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో సోమవారం గుండె జబ్బు కలిగిన వారికి ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. లయన్స్‌క్లబ్ ప్రాజెక్టు మేనేజర్ డాక్టర్ శివ, మున్సిపల్ చైర్మన్ అలీమ్‌బాషా, రాష్ట్రజానపదకళల సంస్థ చైర్మన్ కొండవీటి నాగభూషణంతో కలసి శిబిరం ప్రారంభించారు. బెంగళూరుకు చెందిన నారాయణ హృదయాలయ వారిచే 136 మంది రోగులకు పరీక్షలు నిర్వహించి 24 మందిని ఆపరేషన్లకు ఎంపిక చేశారు. డాక్టర్ శివ మాట్లాడుతూ అవసరమైన వారికి ఉచితంగా ఆపరేషన్లు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో క్లబ్ ప్రతినిధులు శ్రీరాములు, ఈశ్వరమ్మ, నానబాలసురేష్, గోపాలకృష్ణ, సూరి పాల్గొన్నారు.

జంతు సంరక్షణ వారోత్సవాలు



అవగాహన కల్పిస్తున్న డాక్టర్ పవన్‌కుమార్

చౌడేపల్లె: జంతువుల పట్ల సేవాభావం కల్గి ఉండాలని పశువైద్యాధికారులు దినేష్‌రెడ్డి, పవన్‌కుమార్ పేర్కొన్నారు. జంతు సంక్షేమ పక్షోత్సవాల్లో భాగంగా మేకలవారిపల్లె, చౌడేపల్లెలో సోమవారం వారు పాఠశాల విద్యార్థులకు అవగాహన కల్పించారు. వారు మాట్లాడుతూ జంతువుల పట్ల ప్రజలు మానవత్వంతో వ్యవహరించాలన్నారు. ఉపాధ్యాయులు హరినాథ్, మల్లెప్ప, రమణ, చలపతి సిబ్బంది రెడ్డిప్రసాద్, రమణ ఉన్నారు.

కుప్పం: జంతు సంరక్షణ వారోత్సవాల సందర్భంగా కుప్పం అంబేడ్కర్ బాలుర గురుకుల పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రాంతీయ పశు వైద్యశాల సహాయ సంచకులు డా.ఎస్ రెడ్డి కుమారి జంతువుల పట్ల ఎలా మెలగాల్లో విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పశువైద్యాధికారులు పాల్గొన్నారు.

త్రైత సిద్ధాంతంపై ప్రచారం

శాంతిపురం: రథ సప్తమి, యోగి వేమన జయంతి పురస్కరించుకుని ప్రబోధ సేవా సమితి ఆధ్వర్యంలో సోమవారం ఎంకే పురంలో వేమన పద్యాలు, త్రైత సిద్ధాంత భగవద్గీతలపై ప్రచారం నిర్వహించారు. భగవద్గీత, వేమన శతకాల పుస్తకాలను స్థానికులకు అందజేశారు. సమితి అధ్యక్షుడు కృష్ణమూర్తి, సభ్యులు రంగప్ప, చిన్నప్ప, చిన్నక్క పాల్గొన్నారు.

ఫుట్‌పాత్ పనులు ప్రారంభం



పనులు ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్మన్

కుప్పం: పట్టణంలోని యాక్సిస్ బ్యాంక్ నుంచి ఆర్టీసీ బస్టాండు వరకు ఉన్నా పెద్ద కాలుపై ఫుట్‌పాత్ నిర్మాణ పనులను సోమవారం ప్రారంభించారు. ప్రజల విన్నపం మేరకు మున్సిపల్ చైర్మన్ సుధీర్ స్పందించి ఈ పనులకు శ్రీకారం చుట్టారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రవిరెడ్డి, వైస్ చైర్మన్ మునుస్వామి, స్థానిక కౌన్సిలర్ సోము పాల్గొన్నారు.

నందిపై కాశీ విశ్వేశ్వరుడు



పలమనేరు: పట్టణంలోని కాశీ విశ్వేశ్వరుని వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామి వారు సోమవారం అధికార నందివాహనంపై ఊరేగారు. ఆలయం వద్ద ఉదయం అభిషేకం, గ్రామోత్సవం తదితర కార్యక్రమాలు జరిగాయి. ఆలయ కమిటీ చైర్మన్‌తోపాటు సభ్యులు, ఎండోమెంట్ అధికారులు, భక్తులు పాల్గొన్నారు.

నేడు 'వలంటీర్' ఇంటర్వ్యూలు

పలమనేరు: పురపాలక సంఘ పరిధిలోని ఖాళీ ఉన్న వార్డు వలంటీర్లకు నేటి ఉదయం 11 గంటలకు స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ఇంటర్వ్యూలను నిర్వహించనున్నట్టు మున్సిపల్ కమిషనర్ కిరణ్‌కుమార్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. అర్హులైన వారి సెల్‌ఫోన్లకు సందేశం పంపామని అందులో తెలిపారు. సందేశం రాని వారుసైతం ఇంటర్వ్యూలకు హాజరు కావచ్చని అందులో పేర్కొన్నారు.

జాతిపిత గాంధీజీకి ఘన నివాళి





పలమనేరు: పండ్లను పంపిణీ చేస్తున్న వాసవీ క్లబ్ వనిత నిర్వాహకులు, చౌడేపల్లె బస్టాండులో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

చౌడేపల్లె: మహాత్మా గాంధీ వర్ధంతిని పురస్కరించుకుని సోమవారం ఘన నివాళులర్పించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి చౌడేపల్లె ఉన్నత పాఠశాల విద్యార్థులతో కలిసి పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. గాంధీ కలలుగన్న గ్రామస్వరాజ్యం కోసం మనమందరం కృషిచేయాలని ఆర్యవైశ్య సంఘం మండలాధ్యక్షుడు క్రిష్ణమూర్తి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సుబ్రమణ్యం, దొరస్వామి తదితరులున్నారు.

కుప్పంలో...

కుప్పం: జాతిపిత మహాత్మా గాంధీ వర్ధంతి సందర్భంగా సోమవారం కాంగ్రెస్ నాయకులు ఘన నివాళులర్పించారు. పట్టణంలోని గాంధీ విగ్రహానికి డీసీసీ అధ్యక్షులు డా.సురేష్ బాబు పూలమాల వేసి నివాళి అర్పించారు.

పండ్ల పంపిణీ

పలమనేరు: స్థానిక బజారువీధిలో ఆర్యవైశ్యసంఘం, వాసవీ క్లబ్ వనిత ఆధ్వర్యంలో మహాత్మాగాంధీ చిత్రపటానికి పూలమాలలువేసి నివాళుర్పించారు. వాసవీ క్లబ్ వనిత నిర్వాహకులు ప్రతి నెలా ఐదుగురు పేదలకు రూ.200 పింఛను అందించే కార్యక్రమాన్ని ప్రారంభించారు. వారికి నిత్యావసర వస్తువులు, పండ్లను అందజేశారు. ఆర్యవైశ్య సంఘ నేతలు సత్యప్రకాష్, వాసవీ క్లబ్ వనిత నిర్వాహకులు ఉష, దీపిక, కవిత, రమ్య పాల్గొన్నారు.

పుంగనూరులో

పుంగనూరు: మున్సిపాలిటీలో చైర్మన్ అలీమ్‌బాషా ఆధ్వర్యంలో గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ నరసింహప్రసాద్‌రెడ్డి, రాష్ట్ర జానపదకళల సంస్థ చైర్మన్ కొండవీటి నాగభూషణం, జిల్లా వైఎస్సార్‌సీపీ కార్యదర్శి ఫక్రుద్దీన్‌షరీఫ్, కౌన్సిలర్ రేష్మా, నాయకులు రాజేష్, రమణ, సురేష్ పాల్గొన్నారు.

శివాలయంలో భక్తి శ్రద్ధలతో ప్రత్యేక పూజలు





ప్రత్యేక అలంకారంలో శివపార్వతుల ఉత్సవమూర్తులు, ఎరికలపల్లెలో శివకోటి భజన బృందం

చౌడేపల్లె: మండల కేంద్రంలోని బజారు వీధిలో వెలసిన శ్రీ అభీష్టద మృత్యుంజయేశ్వరస్వామి ఆలయంలో సోమవారం భక్తి శ్రద్ధలతో ప్రత్యేక పూజలు చేశారు. వేదపండితులైన రాజశేఖర దీక్షితులు, కుమారస్వామి, మహేష్‌స్వామి ఆధ్వర్యంలో స్వామివారి ఉత్సవమూర్తులకు అభిషేకాలు, పూజల అనంతరం సుందరంగా పుష్పాలతో అలంకరణ చేశారు. అనంతరం శాస్త్రోక్తంగా స్వామివారికి పూజలు చేవారు. పూజా కార్యక్రమాలకు అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. వీరికి నిర్వాహకులు తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు.

ఎరికలపల్లెలో అలరించిన శివకోటి

మండలంలోని చారాల పంచాయతీ ఎరికలపల్లెలో సోమవారం గ్రామస్తుల ఆధ్వర్యంలో శివకోటి నిర్వహించారు. శివపార్వతుల చిత్రపటాల వద్ద వేదపండితుల మంత్రోచ్చారణల నడుమ కలశాలను ఏర్పాటుచేసి ప్రత్యేక పూజలు చేశారు. జంగాలపల్లెకు చెందిన భజన బృందంతోపాటు గురువులు తరిగొండ హరి, గుట్టపల్లె రామన్న, ఎస్ అగ్రహారం కృష్ణప్ప, హార్మోనిస్ట్ రెడ్డెప్పల పాల్గొని శివకోటి నామస్మరణం జపించారు. నిర్విరామంగా 24 గంటల పాటు ఆలపించారు.

గృహ నిర్మాణాలు వేగవంతం చేయండి



లబ్ధిదారులతో మాట్లాడుతున్న డీఈ మధుసూదన్ రెడ్డి

రొంపిచెర్ల: వైఎస్సార్ జగనన్న లే అవుట్లలో ప్రభుత్వం మంజూరు చేసిన గృహ నిర్మాణ పనులను వేగవంతం చేయాలని హౌసింగ్ డీఈ మధుసూదన్‌రెడ్డి తెలిపారు. ఆయన సోమవారం బొమ్మయ్యగారిపల్లె పంచాయతీలోని జగనన్న హౌసింగ్ లే అవుట్లలో జరుగుతున్న ఇళ్ల నిర్మాణ పనులను తనిఖీ చేశారు. డీఈ మాట్లాడుతూ ఉగాది పండుగ నాటికి ప్రభుత్వం గృహప్రవేశాలు చేయాలని నిశ్చయించినట్లు వెల్లడించారు. దీన్ని దృష్టిలో పెట్టుకుని ఇళ్ల పనులను పూర్తి చేయాలన్నారు. ఎక్కడైనా పనులు ప్రారంభం చేయకపోతే ఇంటి పట్టాలను రద్దు చేస్తామని హెచ్చరించారు. లబ్ధిదారులు చేసిన పనులకు ఎప్పటికప్పుడు బిల్లులు చెల్లిస్తామని చెప్పారు. ఎవరూ బిల్లుల కోసం ఎదురు చూడాల్సిన పని లేదన్నారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ యోగానంద్, వర్క్ ఇన్‌స్పెక్టర్ మస్తానమ్మ తదితరులు పాల్గొన్నారు.

అందరి సమన్వయంతో అధిక మెజారిటీ



సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి

సదుం: అందరి సమన్వయంతో రానున్న ఎన్నికల్లో అత్యధిక మెజారిటీ సాధించేందుకు కృషి చేద్దామని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో ఐదు పంచాయతీల పరిధిలోని సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లు, ప్రజాప్రతినిధులతో సోమవారం ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. పెద్దిరెడ్డి మాట్లాడుతూ, గతంలో ఎన్నడూ లేని విధంగా అనేక సంక్షేమ పథకాలను ప్రస్తుత ప్రభుత్వం ప్రతి ఇంటికీ అందిస్తోందని గుర్తుచేశారు. కోట్లాది రూపాయలతో అభివృద్ధి కార్యక్రమాలు జోరుగా సాగుతున్నాయన్నారు. వీటిని ప్రతి ఒక్కరికీ తెలియజేసి రానున్న ఎన్నికల్లో మంత్రి పెద్దిరెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డికి అత్యధిక మెజారిటీ సాధించడమే లక్ష్యంగా పని చేయాలన్నారు. కొన్ని గ్రామాల్లో గ్రూపు రాజకీయాలు బోటు చేసుకుంటున్నాయని, వాటిని సహించేది లేదని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎంపీపీ ఎల్లప్ప, జెడ్పీటీసీ సభ్యుడు సోమశేఖర్‌రెడ్డి, సింగిల్‌విండో చైర్మన్ తిమ్మారెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ రెడ్డెప్పరెడ్డి, సచివాలయాల మండల కన్వీనర్ ప్రకాష్‌రెడ్డి, కోఆప్షన్ సభ్యుడు ఇమ్రాన్, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

కుష్టు వ్యాధి నిర్మూలనపై అవగాహన ర్యాలీలు

బైరెడ్డిపల్లి: మండల కేంద్రంతోపాటు, తీర్థం పీహెచ్‌సీ పరిధిలో సోమవారం కుష్ఠువ్యాధి నిర్మూలనపై విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. వైద్యాధికారులు విజయ్‌చంద్ర, అరుణ్‌కుమార్ మాట్లాడుతూ చర్మంపై స్పర్శలేని మచ్చలు, చర్మం ఉబ్బెత్తుగా ఉండడం, కనురెప్పలు మూత పడకపోవడం, చల్లని లేదా వేడిని గుర్తించలేకపోవడం, కనుబొమ్మల రెప్పలు వెంట్రుకలు రాలిపోవడం తదితర లక్షణాలు ఉంటే తప్పనిసరిగా వైద్యాధికారుల సలహాలను పాటించాలన్నారు. కుష్ఠువ్యాధిపై ఆందోళన చెందనవసరం లేదన్నారు. ఈ కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్లు సావిత్రమ్మ, శ్రీదేవి, ఉపాధ్యాయులు, ఆరోగ్యసిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

చికిత్స పొందకుంటే వైకల్యం

పెద్దపంజాణి: మండలంలోని రాయలపేట గ్రామంలో వైద్యాధికారి నిరంజన్ కుమార్ ఆరోగ్య కేంద్రం సిబ్బందితో కలసి కుష్టు వ్యాధిపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సకాలంలో కుష్టు వ్యాధికి చికిత్స పొందకపోతే అంగవైకల్యానికి దారి తీస్తుందని తెలిపారు. కుష్టు వ్యాధికి అన్ని ప్రభుత్వ ఆస్పత్రులలో చికిత్స ఉచితంగా లభిస్తుందని చెప్పారు. విద్యార్థులు దీనిపై పూర్తి అవగాహన కలిగిఉండి, గ్రామీణుల్లో చైతన్యం తేవాలని సూచించారు. కార్యక్రమంలో సూపర్ వైజర్లు మధు, గీతాంజలి, పీహెచ్‌ఎన్ శమంతక మణి పాల్గొన్నారు.

ప్రాథమిక దశలో గుర్తిస్తే...

పులిచెర్ల(కల్లూరు): కుష్టువ్యాధి నివారణపై కల్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య సిబ్బందితో అవగాహన ర్యాలీ నిర్వహించారు. మెడికల్ ఆఫీసరు డా.జానకీరావు మాట్లాడుతూ కుష్టు వ్యాధి నయం కాదు అన్నది గత చరిత్ర అని ప్రస్తుతం ఈ వ్యాధిని ప్రాథమిక దశలో గుర్తిస్తే నయం చేయవచ్చని తెలిపారు. ఈ వ్యాధి లక్షణాలు, తీసుకోవలసిన జాగ్రత్తలు వివరించారు. హెల్త్ సూపర్‌వైజర్ శారద, ఏఎన్‌ఎంలు లావణ్య, షబానా, హరిత, ఆశావర్కర్లు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఉచితంగా వైద్యం

రొంపిచెర్ల: కుష్టు వ్యాధిపై ప్రజలు అవగాహన పెంచుకోవాలని మండల కేంద్రంలో విద్యార్థులు అవగాహన ర్యాలీ నిర్వహించారు. మండల ఆరోగ్య విద్యాధికారి రాజేశ్వరి మాట్లాడుతూ కుష్టు వ్యాధిని మొదట్లోనే గుర్తిస్తే అంగ్య వైకల్యం రాకుండా చేయవచ్చన్నారు. ఈ వ్యాధికి పూర్తి ఉచితంగా వైద్యం చేస్తామని అన్నారు. 2030 సంవత్సరం నాటికి కుష్టు రహిత దేశంగా తయారు చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. దీన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ సరళ, ఆరోగ్య సిబ్బంది పంకజ, గాయిత్రి, సాయి పూజిత, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పుంగనూరులో..

పుంగనూరు: పట్టణంలో కుష్టువ్యాధి నివారణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని డాక్టర్ బాలసాయిరెడ్డి కోరారు. పట్టణంలో వైద్య సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. డాక్టర్ మాట్లాడుతూ కుష్టు వ్యాధి నివారణకు వైద్య సిబ్బంది గ్రామంలో పర్యటించనున్నట్లు తెలిపారు. ఈ వ్యాధిపట్ల పాఠశాలల్లో అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. ఈ ర్యాలీలో డీపీఎంవో దేవదాసు, సిబ్బంది ఆదిలక్ష్మీ, ఆనంద, ఉషా తదితరులు పాల్గొన్నారు.



బైరెడ్డిపల్లె: ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యాధికారులు



పెద్దపంజాణిలో..



కల్లూరులో..



రొంపిచెర్ల క్రాస్‌లో..



పుంగనూరులో..